
# జీవిత పరమార్థం

ఇంత అద్భుతమైన ప్రపంచంలో జన్మించినందుకు మనుషులు ఆనందాంబుధిలో ఓలలాడాలి. కానీ, కొంత మంది అనుక్షణం సమస్యలు సృష్టించుకొని మరిన్ని బాధల్ని ఊహించుకొని బాధపడుతుంటారు. మరికొందరు తమ జీవితకాలం భగవత్ నిర్దేశితం కాబట్టి, అందులోని ప్రతి క్షణాన్నీ సద్వినియోగం చేసుకొని తరిస్తుంటారు. కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. అది ఒకరి జీవిత గమనానికి అనుగుణంగా చరించదు. ఏదో అద్భుతం జరిగిందని కొన్ని క్షణాలు ఆగదు. అలా అని, బీభత్సం జరిగిపోతోందని వేగంగా ముందుకు సాగదు. అందుకే మనిషి కాలచక్ర గతిని అనుసరిస్తూ, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి.

శైశవం నుంచి వృద్ధాప్యం దాకా, జీవితంలోని అన్ని దశలూ విలువైనవే. బాల్యమే బంగారమని, తలచి తలచి మురిసిపోతాడు మనిషి. నడి వయసులో బాధ్యతలు మరీ పెరగడంతో, సమస్యల సుడిగుండం ఎదురైందంటూ అసంతృప్తిగా కాలం గడుపుతాడు. వృద్ధాప్యం అంటే జీవిత చరమాంకమన్న భావంతో, నిరాశలోనే కొట్టుమిట్టాడతాడు. అలా తన జీవితాన్ని గాలిలో దీపంలా చేసుకుంటాడు!

మొగ్గ దశలోనే విరిసిన పిల్లల్ని చూస్తుంటాం. సమస్యలతో ఎంత సతమతమవుతున్నా, నడి వయసును సరైన ధ్యేయంతో భానుడిలా ఉపయుక్తం చేసుకున్నవారు కనిపిస్తారు. ఇక వృద్ధాప్యంలో- ఎనభైలు దాటినా ద్విగుణీకృత ఉత్సాహంతో వెలిగినవారూ మనకు తెలుసు. రాజకీయవేత్తల్లో అపర చాణక్యుల్లా మంత్రాంగం సాగించినవారున్నారు. వయసు మళ్లినా స్వాములు జ్ఞానబోధ చేసి, ప్రజలకు మంచి మార్గం చూపుతారు. దశల చక్రభ్రమణం మనిషి ఒక్కడికే పరిమితం కాదు. రుతువులకు, చెట్లకు, సమస్త జీవరాశికీ పరిణామ దశలుంటాయి. అవేవీ మనిషిలా పలురకాల ఆలోచనలతో కుంగిపోవు. వాటికి వర్తమానమే ముఖ్యం. దాన్ని అవి ఆనందంగా, ఆహ్లాదంగా గడుపుతాయి.



అంతర్యామి

పోనుపోను చెట్లు మోడులవుతాయి. పచ్చదనం లేని కట్టెలవుతాయి. ఆ చెట్లపై నివాసం ఉండే పక్షులకు అది గడ్డుకాలమే! అయినా, నాలుగు చినుకులు పడితే తరువు తనువు సమస్తం పత్రహరిత మయమవుతుంది. పువ్వులతో చెట్టు నవ్వుతుంది. పక్షులు స్వేచ్ఛగా విహరిస్తూ కిలకిలారావాలతో తిరిగి ఇళ్ల గూళ్లకు చేరుకుంటాయి.

గ్రీష్మంలో నదీనదాలు ఎండిపోతాయి. అందులోని జీవులకు దిక్కు తోచదు. వర్షరుతువు వచ్చిందంటే చాలు- కొత్తనీటితో నిండిన నదుల హొయలు చూసేందుకు రెండు కళ్లూ చాలవు. సూర్యుడు ఎంతగా ధగధగలాడుతున్నా, ఒక్కోసారి ఆకాశం మేఘావృతమవుతుంది. మబ్బులు కమ్ముకొస్తాయి. అంతమాత్రానికే సూర్యుడి పని అయిపోయినట్లు కాదు. మబ్బులు తొలగాక, మళ్లీ సూర్య ప్రతాపం మామూలే! చంద్రుడు అమావాస్య వరకు క్షీణిస్తాడు. ఆ తరవాత దినదినాభివృద్ధితో సంపూర్ణత్వం పొంది, పున్నమి వెలుగులందిస్తాడు.

ఏదీ శాశ్వతం కాదని, అంతా తాత్కాలికమే అని ఒక గురువులా బోధిస్తుంది ప్రకృతి. విచక్షణ కలిగిన మనిషి అసలు విషయమేమిటో గ్రహించాలి. ప్రస్తుత స్థితి... ఆనందమైనా, బాధైనా- ఎప్పటికీ అదే కొనసాగుతుందన్న భ్రమలో అతడు ఉండకూడదు.

మంచి జరిగితే, భగవంతుడి కృప దండిగా ఉందని దండాలు పెడతాడు మనిషి. ఘనంగా పూజలు చేస్తాడు. భూరి కానుకలిస్తాడు. కష్టాలు వస్తే, దేవుడు చల్లగా చూడటం లేదని కినుక వహిస్తాడు. ఎందుకిలా?

అంతర్యామి- ఎవరి అంచనాలకూ అందని ఒక మహాశక్తి. ఆ శక్తిని అనుభూతి చెందాలంటే, మనిషి తామరాకు మీద నీటిబొట్టులా ఉండాలి. ఎటువంటి భావ మాలిన్యమూ అంటుకోని దశకు అతడు చేరుకోవాలి. నవ విధ భక్తి మార్గాల్లో ఏదో ఒకదాన్ని సొంతం చేసుకొని తనదైన రీతిలో ముందుకు సాగినప్పుడే, ఆ జీవితానికి ఓ అర్థం, పరమార్థం ఏర్పడతాయి!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు